సాక్షి మహబూబాబాద్

సోమవారం | 19 | జూన్ | 2023



అండగా ఉంటాం

గుడిసెవాసులకు ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ అన్నారు. - IIలో ▸



తపాలా శాఖలో ఆధార్ సేవలు

తపాలా కార్యాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. - IIIలో ▸

గరిష్టం/కనిష్టం

43.7° /29.8°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇంటింటికీ నీరు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే..



బయ్యారం: ఇంటింటికీ తాగునీరు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ బిందు అన్నారు. మండలంలోని బాలాజీపేటలో మంచినీళ్ల పండుగ సందర్భంగా ర్యాలీ నిర్వహించిన అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. గతంలో మంచినీళ్ల కోసం బిందెలు పట్టుకొని బయటకు వెళ్లాల్సి వచ్చేదని.. నేడు ఇంటింటికీ తాగునీరు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చలపతిరావు సర్పంచ్ జగన్, ఉపసర్పంచ్ వీరభద్రం, పంచాయతీ కో–ఆప్షన్‌సభ్యుడు రాంమూర్తిగౌడ్, భగీరథ జేఈ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన రవికుమార్



డోర్నకల్: ఇటీవల సీఐగా పదోన్నతి పొందిన డోర్నకల్ ఎస్సై రవికుమార్ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐగా పదోన్నతి పొందడంతో రవికుమార్‌కు ఎస్పీ మూడో స్టార్ అందించి అభినందించారు.

20న క్రికెట్ ఎంపిక పోటీలు

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో జట్టు ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 20న ఉదయం 9గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జ్ సయ్యద్ జాకీర్ అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి అండర్–19, అండర్–25 క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలు, క్రికెట్ డ్రెస్, సొంత కిట్‌తో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9032559471నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్ల రామచంద్రరెడ్డి, దేశబోయిన శ్రీనివాస్, నాయకులు ఎండీ. గౌస్, భరత్, జమీర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మహబూబాబాద్ అర్బన్: ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, అన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిసి రావాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు లేవని, ఐదేళ్లుగా బదిలీలులేక ప్రభుత్వ విద్యారంగం కుంటుపడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. డీఈఓ, డిప్యూటీ డీఈఓ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లో పని చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగులకు కనీస వేతనం వర్తింపజేయాలని, వారిని రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మల్లా రెడ్డి, ఆవారి శ్రీనివాస్, యాకూబ్, స్వప్న, వీరస్వామి, మంజుల, జనార్దనచారి, వివేక్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులను కఠినంగా శిక్షించాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్‌పై దాడి చేసిన భూకబ్జాదారులను కఠినంగా శిక్షించాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి రాములు అన్నారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ.. భూముల సర్వేకు వెళ్లిన తహసీల్దార్‌పై దాడికి పాల్పడడం బాధాకరమన్నారు. సర్వే సమయంలో కలెక్టర్, ఎస్పీ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కొన్ని రాజకీయ పార్టీల ముసుగులో పేదల పట్టా భూములను సైతం కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో రోజురోజుకూ భూ కబ్జాలు పెరిగిపోతున్నాయన్నారు. విధి నిర్వహణలో ఉన్న తహసీల్దార్‌పై దాడి చేసిన యువకులపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

విత్తన వేట..

- మేలురకం సీడ్స్ కోసం అన్వేషణ
- గత ఏడాది దిగుబడి ఆధారంగా ఎంపిక
- వరి, పత్తి, మిర్చి విత్తనాల సేకరణలో రైతన్నలు బిజీబిజీ



సాక్షి, మహబూబాబాద్: జూన్ మాసం మధ్యలోకి వచ్చినా ఇప్పటి వరకు వర్షాలు పడలేదు. అయినప్పటికీ రైతులు మాత్రం సాగుపనుల్లో బిజీగా మారారు. గత ఏడాది పంటల దిగుబడిని దృష్టిలో పెట్టుకుని మేలురకం విత్తనాల కోసం వేట ప్రారంభించారు. ఎక్కువ దిగుబడితో పాటు, చీడపీడలను ఎదుర్కొనే శక్తి ఉన్న విత్తనాల గురించి రైతులు తెలుసుకుంటున్నారు. అయితే విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా.. పత్తి విత్తనాల విషయానికొస్తే డిమాండ్ ఉన్న విత్తనాలు దొరకడం లేదు. పలు షాపుల యజమానులు బ్లాక్ చేసి ఇతర మందులు, విత్తనాలు తీసుకుంటేనే రైతులు అడిగిన రకం విత్తనాలు ఇస్తామని చెబుతున్నారు. దీంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

విత్తనాల సేకరణ..

ఈ వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి 4,47,942 ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో అత్యధికంగా 2.12లక్షల ఎకరాల్లో వరి, 98,600ఎకరాల్లో పత్తి, 48,850ఎకరాల్లో మొక్కజొన్న, 72,800ఎకరాల్లో మిర్చి పంటలతోపాటు వేరుశనగ, పెసర, కంది, పసుపు, పొగాకు, చెరుకు, జొన్న, నువ్వులు మొదలైన పంటల సాగుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం 71,764 క్వింటాళ్ల విత్తనాలు, 1,18,321 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని పేర్కొన్నారు. ఇందులో 53వేల క్వింటాళ్ల వరి, 1,97,200 పత్తి ప్యాకెట్లు, 72 క్వింటాళ్ల మిర్చి విత్తనాలు కావాలి. అయితే వరి విత్తనాలు సాధారణంగా దొరికినా.. మిర్చి, పత్తి విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలు బ్లాక్..

రైతుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు వ్యాపారులు అన్నదాతల నుంచి డిమాండ్ ఎక్కువ ఉన్న విత్తనాలను బ్లాక్ చేస్తున్నారు. పత్తి విత్తనాల్లో ప్రధానంగా సాకేత్, యూఎస్ 7067 రకం మంచి దిగుబడి వస్తుందని ప్రచారం. దీంతో ఈ విత్తనాలు కావాలని రైతులను కోరుతుండంతో కొందరు వ్యాపారులు వాటిని బ్లాక్ చేసినట్లు సమాచారం. ఈ విత్తనాల ప్యాకెట్ కావాలంటే ఇతర ఎరువులు, విత్తనాలు తమ షాపులోనే కొనాలని లింకు పెడుతున్నారని రైతులు చెబుతున్నారు. అదే విధంగా 450 గ్రాములు విత్తనాల ప్యాకెట్ రూ.853 విక్రయించాల్సి ఉండగా.. రైతుల డిమాండ్ నేపథ్యంలో కృత్రిమ కొరత సృష్టించి ప్యాకెట్‌ను రూ.1,200 నుంచి రూ.2వేల వరకు విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

మిర్చి విత్తనాలకోసం గుంటూరు బాట..

గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మిర్చి విత్తనాలకోసం రైతులు గుంటూరు బాట పడుతున్నారు. రెండు సంవత్సరాలుగా మిర్చి పంటను ఆశించిన నల్లతామర, పేను బంకను తట్టుకునే విత్తనాలు ఏంటి.. ఎక్కడి నుంచి తెచ్చారు. అనే విషయం తెలుసుకొని రైతులు గుంటూరులోని షాపుల వైపు పరుగులు పెడుతున్నారు. వీటితో పాటు అక్కడ పురుగు మందులు, పంటలు ఏపుగా పెరిగేందుకు దోహదపడే మందులు తక్కువ ధరకు వస్తున్నాయని, పంటలపై మంచిగా పనిచేస్తున్నాయని అందుకోసమే గుంటూరు వెళ్తున్నామని రైతులు అంటున్నారు.

వెంటాడుతున్న నకిలీ భయం

పోలీసులు, అధికారులు ఎన్ని తనిఖీలు చేసినా.. రైతులను నకిలీ విత్తనాల భయం వెంటాడుతూనే ఉంది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి ముఠాలు వచ్చి.. జిల్లాలోని ఆదివాసీ గూడేలు, గిరిజన తండాల్లో తిష్టవేసి నకిలీ విత్తనాలు అంటగడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఏజెన్సీ ప్రాంతంలో పేరు, ఊరు లేని విత్తనాలు, బిల్లులు లేకుండా దిగుమతి చేసుకున్న విత్తనాలను పట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు వరంగల్‌లో పెద్దమొత్తంలో నకిలీ విత్తనాలను పట్టుకున్న సంఘటనతో ఆ ప్రభావం జిల్లాలోని పెద్దవంగర, తొర్రూరుతో పాటు కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాలపై పడే అవకాశం ఉందని అధికారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేదికపై మంత్రి సత్యవతి రాథోడ్

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- అబ్బాయిపాలెంలో మంచినీళ్ల పండుగ
- హాజరైన మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్,శంకర్‌నాయక్

మరిపెడ రూరల్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు శుద్ధి చేసిన, సురక్షితమైన తాగునీరు అందించడమే మిషన్ భగీరథ పథకం లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారు ఎదెల్ల గుట్టపై 170 ఎంఎల్‌డీ నీటిశుద్ధి కేంద్రం వద్ద మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. పాలకుర్తి, డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలతో కలిసి నీటి శుద్ధి కేంద్రం పనితీరు, మిషన్ భగీరథ నీటి నాణ్యతను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ శశాంక అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడారు. తెలంగాణ పల్లెల్లో ఏ ఆడ బిడ్డ మంచినీళ్ల కోసం బిందె పట్టుకొని వీధుల్లోకి రావద్దనే గొప్ప సంకల్పంతో సీఎం కేసీఆర్ మిషన భగీరథ పథకాన్ని రూపొందించారన్నారు. తెలంగాణలో ప్రతీ ఇంటికి నల్లా ద్వారా మంచినీళ్లు అందుతున్నాయన్నారు. మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. తన చిన్నతనంలో సుదూర ప్రాంతాల నుంచి తాగునీరు తెచ్చుకునేదని, నెత్తిమీద వెంట్రుకలు ఊడిపోయేవనన్నారు. సీఎం కేసీఆర్ తెచ్చిన మిషన్ భగీరథ పథకంతో ఈ రోజు మహిళలకు నీళ్లు మోసే కష్టాలు తీరాయన్నారు. మానుకోట ఎంపీ కవిత మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పేదల కష్టాలు తీర్చుతున్నాడన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి సరఫరాలో లోపాలు ఉంటే అధికారులు స్పెషల్‌డ్రైవ్ ద్వారా సరిచేయాలని సూచించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. పేద ప్రజలు నీళ్లు కొనలేరని తెలుసుకున్న సీఎం కేసీఆర్ ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు ఇస్తున్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, మరిపెడ ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ సిందూర ఉన్నారు.

బిస్లరీ వాటర్ బాటిల్స్ తేవడం ఏంటి?



కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్ భగీరథ నీళ్లపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో మంత్రి దయాకర్‌రావు బిస్లరీ ఆఫ్ లీటర్ బాటిల్‌లోని నీటిని తాగాడు. ఈ మేరకు ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పిస్తున్న తరుణంలో వేదికపైకి బిస్లరీ వాటర్ బాటిల్స్ తేవడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే మిషన్ భగీరథ అధికారులు ఆ బాటిళ్లను తీసివేసి గ్లాసుల్లో మిషన్ భగీరథ నీరు తెచ్చి ఇవ్వడం గమనార్హం. కాగా సమావేశం ఆలస్యంగా ప్రారంభం కావడంతో మంత్రులు మాట్లాడుతున్న సమయంలో కార్యకర్తలు, ప్రజలు మధ్యలోనే లేచి వెళ్లిపోయారు.

హైకోర్టు జడ్జికి స్వాగతం

తొర్రూరు రూరల్: హైకోర్టు జడ్జి జి.తుకారాం ఆదివారం తొర్రూరుకు రాగా స్థానిక మిషన్ భగీరథ గెస్ట్‌హౌస్‌లో జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీసుల నుంచి జడ్జి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుకు వచ్చే కేసులను ఎప్పటికప్పుడు విచారణ జరుపుతున్నామని, నేరస్తులుగా రుజువైన వెంటనే కఠిన శిక్షలు విధించడం ద్వారా బాధితులకు కోర్టులపై నమ్మకం కలిగిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆయన జిల్లా కోర్టును సందర్శించారు. కార్యక్రమంలో తొర్రూరు జడ్జి సరిత, ఆర్డీఓలు రమేష్, కొమురయ్య, తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, ఎంపీడీఓ కుమార్ పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జి తుకారాంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి తుకారాం ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయన పేరుపై గోత్రనామార్చనలు చేశారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో ఆలయ పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట మహబూబాబాద్ జిల్లా జడ్జి చంద్రశేఖర ప్రసాద్, ఆర్డీఓ కొమురయ్య తదితరులు ఉన్నారు.

అనంతాద్రీశుడి దర్శనం

మహబూబాబాద్ రూరల్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని అనంతాద్రి శ్రీజగన్నాథ వేంకటేశ్వరస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి తుకారాం దర్శించుకున్నారు. మొదటిసారి ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని న్యాయమూర్తికి బహూకరించారు.

కేసీఆర్ పాలనలో జలకళ

- ఎంపీ మాలోత్ కవిత

దంతాలపల్లి: సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రానికి జలకళ వచ్చిందని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం మరిపెడలో నిర్వహించిన మంచినీళ్ల పండుగ కార్యక్రమానికి మండలం నుంచి తరలివెళ్తున్న బస్సులను ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరాయి పాలనలో తెలంగాణ ప్రాంత రైతులు సాగు, తాగునీటికి ఇబ్బందులు పడేవారని, స్వరాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ భారీ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి బీడు భూములకు నీరందిస్తున్నారన్నారు. సాగు, తాగు నీటికి ఢోకా లేదని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ఒలాద్రి ఉమామల్లారెడ్డి, మండల రైతు సమన్వయసమితి కోఆర్డినేటర్ మల్లారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెండ్యాల నరేష్, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ అప్సర్‌పాషా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీ కవిత

తెలంగాణలో బీజేపీదే అధికారం

- జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్ సింగ్

మహబూబాబాద్ అర్బన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని జమ్మూకశ్మీర్ మాజీ ఉపముఖ్యమంత్రి నిర్మల్ సింగ్ అన్నారు. ప్రధాని మోదీ 9ఏళ్ల పాలన పూర్తయి సందర్భంగా జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మహాజన్ సంపర్క అభియాన్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ నెల 22నుంచి ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని అన్ని మోర్చాలు కలిసి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌రావు, జిల్లా మాజీ అధ్యక్షుడు యాప సీతయ్య, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మదన్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు రాంబాబు నాయక్, సంపత్, కాశీం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ సింగ్

రిటైర్డ్ ఎంపీడీఓ కిడ్నాప్ విషాదాంతం

అపహరించిన రోజే రామకృష్ణయ్య హత్య

- చంపక్‌హిల్స్ కంకర క్వారీ నీటిగుంతలో మృతదేహం
- ఘటన స్థలంలోనే పోస్ట్‌మార్టం, బంధువులకు అప్పగింత
- పోలీసుల తీరుపై కుటుంబ సభ్యుల ఆగ్రహం, ఆందోళన
- అధికార పార్టీ నాయకుల ప్రమేయంతో హత్య జరిగిందని ఆరోపణ
- ఎస్సైని సస్పెండ్ చేసి నిందితుల జాబితాలో చేర్చాలని డిమాండ్
- జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ భర్త అంజయ్య సహా ముగ్గురి అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు నిందితులు
- హత్యవెనుక రాజకీయ కోణం లేదు.. భూ వివాదాలతోనే అంజయ్య 'సుపారీ' ప్లాన్
- వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి



చంపక్‌హిల్స్ క్రషర్‌మిషన్ వద్ద నీటి గుంతలో రామకృష్ణయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు



బచ్చన్నపేటలో రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు

సాక్షిప్రతినిధి, వరంగల్/జనగామ/బచ్చన్నపేట: జనగామ జిల్లాలో రిటైర్డ్ ఎంపీడీఓ నల్లా రామకృష్ణయ్య కిడ్నాప్ విషాదాంతంగా మారింది. కిరాయి ముఠా ఆయనను అపహరించి హత్య చేసింది. నాలుగు రోజుల(ఈనెల 15న) క్రితం బచ్చన్నపేట నుంచి స్వగ్రామం పోచన్నపేటకు వెళ్తుండగా కిడ్నాప్ చేసి అదే రోజు హత్య చేసి చంపక్‌హిల్స్ గుట్టల్లోని ఓ క్వారీ నీటిగుంతలో పడేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు బీఆర్‌ఎస్ నేత, జనగామ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి భర్త గిరబోయిన అంజయ్య సహా ఐదుగురిని పోలీసులు గుర్తించారు. అంజయ్యతోపాటు డోలకొండ శ్రీకాంత్, శివరాత్రి బాషా అలియాస్ భాస్కర్‌లను అరెస్టు చేసి వారి నుంచి పోలీసులు ఒక కారు, మూడు సెల్‌ఫోన్‌లు, రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. దుండగుల తిరుపతి, రాజు పరారీలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణయ్య కిడ్నాప్, హత్య వివరాలను సీపీ ఏవీ రంగనాథ్ వివరాలు వెల్లడించారు.

కిడ్నాప్.. హత్య

రామకృష్ణయ్య బచ్చన్నపేట నుంచి పోచన్నపేటకు వెళ్తుండగా కిడ్నాప్‌కు గురైనట్లు తెలిసిన వెంటనే కొడుకు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా గ్రామశివారులో అతడి బైక్ లభించింది. దారిలో సెల్‌ఫోన్ దొరికింది. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించడంతో పాటు కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భర్త అంజయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా కిడ్నాప్ మిస్టరీ వీడి రామకృష్ణయ్య మృతదేహం చంపక్‌హిల్స్ గుట్టల క్వారీ గుంతలో లభించింది. రామకృష్ణయ్య ఒంటిపై బట్టలు లేకుండా ఉండడం.. శరీరంతో పాటు ముఖం నల్లగా మారి కనిపించింది. ముఖం కాల్చారా.. లేదా రెండు రోజుల పాటు తీవ్రమైన ఎండ వేడికి కమిలి పోయి ఉండవచ్చని భావిస్తున్నారు. కాగా పోలీసులు సంఘటన స్థలంలోనే డెడ్‌బాడీకి పోస్టుమార్టం చేయించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డాక్టర్ ప్రదీప్ పోస్టుమార్టం చేసిన అనంతరం, అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామం పోచన్నపేటకు తరలించారు.

బచ్చన్నపేటలో మూడు గంటల రాస్తారోకో..

రామకృష్ణయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు బచ్చన్నపేట మండలం కేంద్రంలో మూడు గంటల పాటు రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా.. ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐ నాగబాబు, శ్రీనివాస్ సిబ్బందితో చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మృతుడి కుమారులు నల్లా అశోక్, శ్రావణ్, భరత్ మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదిరించినందుకే.. కక్షగట్టి మా తండ్రిని హత్య చేశారని ఏసీపీ ఎదుట గొల్లుమన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి భర్త అంజయ్య, కొడవటూర్ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి ప్రధాన సూత్రధారులని ఆరోపించారు. వీరిని ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టకుండా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులు రాతపూర్వకంగా ఫిర్యాదు తీసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు రాస్తారోకోను విరమించారు. అంత్యక్రియల సమయంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు చేపట్టారు. మృతుడికి భార్య పద్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కారుతో ఆచూకీ లభ్యం – మెడపై గాట్లు

ఈ నెల 15న రామకృష్ణయ్యను నిందితులు ఓ ప్రైవేట్ కారులో బచ్చన్నపేట–పోచన్నపేట శివారులో కిడ్నాప్ చేసి, రహస్య ప్రాంతానికి తరలించారు. ఈ క్రమంలో రామకృష్ణయ్య సెల్‌ఫోన్ దారిలో పడిపోవడంతో పోలీసులు సిగ్నల్స్ ఆధారంగా విచారణ మొదలు పెట్టారు. ఇదే సమయంలో కిడ్నాప్‌నకు ఉపయోగించిన కారును కూడా గుర్తించడంతో.. నిందితులను ఈజీగా పట్టుకోగలిగారు. ఇదిలా ఉండగా.. కిడ్నాప్ చేసిన తర్వాత కారులో కూర్చున్న రామకృష్ణయ్య మెడను టవల్‌తో నులిమివేయడంతో మెడపై గాట్లు కనిపించినట్లు పోస్టుమార్టం చేసే క్రమంలో డాక్టర్ గుర్తించినట్లు సమాచారం. నీటి గుంటలో మృతదేహం లభించగా అక్కడి నీటి శాంపిల్స్ సేకరించి పరిశీలనకు పంపినట్లు తెలిసింది.

భూవివాదాలే కారణం

– వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్

'బీఆర్‌ఎస్ నేత, జెడ్పీటీసీ భర్త గిరబోయిన అంజయ్యే మాజీ ఎంపీడీఓ రామకృష్ణయ్య హత్యకు సూత్రధారి.. ఈ కిడ్నాప్, హత్య సుపారీ గ్యాంగ్ చేసింది. అంజయ్య ఈ హత్య కంటే ముందు బామ్మర్ది మల్లేశం భార్య సుభద్రను కూడా రూ.2.50 లక్షల సుపారీ ఇచ్చి హత్య చేయించాడు. రామకృష్ణయ్య హత్యకేసు విచారణలో సుభద్ర హత్యకేసును కూడా అంజయ్య అంగీకరించాడు. రామకృష్ణయ్య కిడ్నాప్, హత్య వెనుక రాజకీయం కోణం లేదు. ఆర్టీఐ ఆక్టివిస్టుగా కూడా ఉన్న ఆయన అసైన్డ్ భూములు దక్కకుండా చేస్తున్నాడనే అక్కసుతో అంజయ్య సుపారీ ఇచ్చి హత్య చేయించాడు' అని వరంగల్ కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరాలను ఆదివారం సాయంత్రం వెల్లడించారు. ప్రధానంగా 174 సర్వే నంబర్‌లో తమ పూర్వీకులకు ఉన్న ఒక ఎకరం అసైన్డ్ భూమికి తోడు ఇరుగు పొరుగు వారి నుంచి ఏడున్నర ఎకరాలను కొనుగోలు చేసిన అంజయ్య భూమిపై తరచూ రామకృష్ణయ్య అధికారులకు ఫిర్యాదు చేసేవాడని, అమెరికాలో ఉండే తన అల్లుడికి చెందిన 8.30 ఎకరాల్లో 5 ఎకరాలు కూడా అసైన్డ్ పేరిట ఫిర్యాదు చేశాడని అంజయ్య కక్ష పెట్టుకుని హత్య చేయించాడని సీపీ వివరించారు.

మహాజాతరకు ముందస్తుగా పనులు పూర్తిచేయాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే మహాజాతరకు ముందస్తుగా అభివృద్ధి పనులన్నీ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె మేడారం సమ్మక్క–సారలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సంప్రదాయంగా దేవాదాయశాఖ అధికారులు, పూజారులు డోలి వాయిద్యాలతో ఎమ్మెల్యేను గద్దెలపైకి స్వాగతం పలికారు. పూజారులు అమ్మవార్ల వస్త్రంతో సన్మానించి ప్రసాదం అందజేశారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. రెండేళ్లకోసారి జరిగే మేడారం మహాజాతరకు దేశం నలుమూలల నుంచి వనదేవతలను దర్శించుకునేందుకు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారన్నారు. వచ్చే ఏడాదిలో జరిగే మేడారం మహాజాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం భద్రతా ఏర్పాట్లు, రోడ్ల అభివృద్ధి, నీటి సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ సారి జాతరకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేసి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


శివకుమార్ (ఫైల్)

నెల్లికుదురు: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఆలేరులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరుకు చెందిన చీకటి శివకుమార్ (53) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శివకుమార్ మద్యానికి బానిసయ్యాడని, దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం మృతుడి తమ్ముడు బీరయ్య చూసి మండలంలోని శ్రీరామగిరిలో ఉన్న మృతుడి భార్యకు ఫోన్ చేసి విషయం తెలిపారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోనాపురంలో వివాహిత ..


సరిత(ఫైల్)

చెన్నారావుపేట : వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కోనాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన దురిశెట్టి నర్సయ్య కూతురు సరితకు కోనాపురం గ్రామానికి చెందిన ఉప్పుల రమేష్‌తో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బ్యాండ్ వాయించి కుటుంబాన్ని పోషించే రమేష్ మద్యానికి బానిసయ్యాడు. 10 సంవత్సరాలుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రమేష్ మద్యం తాగి భార్యను కొట్టాడు. దీంతో కుటుంబ కలహాలు భరించలేక సరిత శనివారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, మృతురాలి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి, పంచనామా అనంతరం శవాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

జనగామ రూరల్: జనగామ–రఘునాథపల్లి రైల్వే స్టేషన్ల మధ్య యశ్వంతాపూర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం తెల్లవారు జామున గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన స్థలానికి కాజీపేట జీఆర్పీ ఎస్సై పరశురాములు చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదని జీన్స్ ప్యాంట్, నల్లని బనియన్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచినట్లు ఎస్సై తెలిపారు.

గుడిసె వాసులకు అండగా ఉంటాం

- పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాటం
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్
- ప్రారంభమైన సీపీఎం బస్సు యాత్ర


మాట్లాడుతున్న బృందాకారత్

నెహ్రూసెంటర్ : గుడిసె వాసులందరికీ ఎర్రజెండా అండగా ఉంటుందని, ప్రస్తుత సమాజంలో నిలువ నీడ కోసం పోరాటం చేయాల్సిన దుస్థితి నెలకొందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ అన్నారు. గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలని, ఇంటి స్థలాలు, డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో బృందాకారత్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మనిషి కనీస అవసరాలైన కూడు, గూడు, నీడ లేకుండా జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల వేధింపులు, పోలీసుల కేసులు కొత్తేమి కాదని గుడిసె వాసులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్ల అవుతున్నా పేదలు కనీస సౌకర్యాలు లేకుండా జీవిస్తున్నారని, దానిని పట్టించుకోకుండా దేశంలో అమృత్ మహోత్సవ్ అంటూ ప్రధానికి మోదీ చెబుతున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని మండిపడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటే పేదల ఇండ్లను కూల్చడమేనా అని ప్రశ్నించారు. మోదీ, బీజేపీని వ్యతిరేకిస్తూనే రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇండ్లు, గుడిసెలను తొలగిస్తామంటే మాత్రం పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం బస్సుయాత్రను ప్రారంభించారు.

గుడిసెల పోరాటాన్ని కొనసాగిస్తాం..

ప్రభుత్వ భూముల్లోని పేదల గుడిసెలను అధికారులు, పోలీసులు ఇప్పటికే పలుమార్లు తొలగించారని, ఎన్ని నిర్బంధాలు ఎదురైనా భూ పోరాటం కొనసాగిస్తామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మానుకోట జిల్లాలో 5 వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఏమయ్యాయని, రియల్టర్లు, భూకబ్జాదారులు దర్జాగా ప్లాట్లు చేసి విక్రయిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ అసైన్డ్ భూములను అమ్ముకుని కోట్లాది రూపాయలు గడిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెల పోరాటం సాగుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ నర్సింహారావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, శెట్టి వెంకన్న, అల్వాల వీరయ్య, వెంకటేష్, కందునూరి శ్రీనివాస్, మండల రాజన్న, కుంట ఉపేందర్, ఆకుల రాజు, దుడ్డెల రామ్మూర్తి, బానోత్ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయానికి కృషి చేయాలి

- హైకోర్టు న్యాయమూర్తి తుకారాంజీ


జిల్లా కోర్టు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి తుకారాంజీ

మహబూబాబాద్ రూరల్ : బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, మహబూబాబాద్ డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎస్.తుకారాంజీ అన్నారు. ఈ మేరకు ఆదివారం మహబూబాబాద్ జిల్లా కోర్టును సందర్శించారు. మొదట జిల్లా కోర్టు నూతన భవన సముదాయం నిర్మాణం కోసం కేటాయించిన సాలార్‌తండా శివారులోని 9.05 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణలో మొక్కనాటి కోర్టు ప్రాంగణం, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మానుకోట జిల్లా కోర్టు మంచి వాతావరణంలో ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏర్పాటు విషయంలో మొదటి ప్రాధాన్యం మానుకోట జిల్లాకే ఇస్తామని, న్యాయవాదులు అడిగిన విషయాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తెలియజేస్తామన్నారు. మౌలిక వసతుల పెంపు, సిబ్బంది కేటాయింపుపై పరిశీలన చేస్తామని, కొత్త కోర్టు భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం బాగుందని పేర్కొన్నారు. న్యాయవాదులు అప్‌గ్రేడ్ కావాలని, కొత్త పద్ధతుల్లో మీడియేషన్‌లో భాగస్వాములు కావాలని తెలిపారు. మానుకోటలో మున్సిఫ్ కోర్టు, అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు, జువైనల్ కోర్టు జస్టిస్ బోర్డు ఏర్పాటుకు పరిశీలన చేస్తామన్నారు. కార్యక్రమంలో మానుకోట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర ప్రసాద్, ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి లలితాశివజ్యోతి, సీనియర్ సివిల్ జడ్జి సి.సురేశ్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి పి.మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి యూ.తిరుపతి, ప్రభుత్వ ప్లీడర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కప్పలకు పెళ్లి

- పల్లకిలో ఊరేగింపు


ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

గార్ల : వర్షాలు కురవాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం చిన్నకిష్టాపురం గ్రామస్తులు ఆదివారం కప్పలకు పెళ్లి చేసి గిరిజన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేపమండలతో పల్లకి తయారు చేసి అందులో కప్పలను పెట్టి నీళ్లు పోస్తూ మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో మాన్‌సింగ్, సురేష్, బలరాం, గోవర్ధన్ భీక్యా, శంకర్, లాల్‌సింగ్, నీలాదేవి, హచ్చి, రాధ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'ఎస్ఆర్' ప్రభంజనం


జి సాత్విక్


జె శశివర్ధన్


పి శ్రీకరి


బి సమీత్


బి సోనుశ్రీ

విద్యారణ్యపురి : దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక పరీక్ష జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023 ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఏ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జాతీయ స్థాయిలో అన్ని కేటగిరీల్లో కలిపి జి సాత్విక్ 10వ ర్యాంకు, జె శశివర్ధన్ 26, పెండెం శ్రీకరి 42, బి సమీత్ 42వ ర్యాంకు సాధించి ఎస్ఆర్ కీర్తిప్రతిష్టలు జాతీయ స్థాయిలో నిలబెట్టారని తెలిపారు. బి సోనుశ్రీ 87వ ర్యాంకు, ఎల్ విశాల్ 114, బానోతు నితీశ్ 135, సి సోనికా 164, బి అభిరామ్‌నాయక్ 168, మణిదీప్‌రెడ్డి ఏ 253 ర్యాంకు సాధించారని తెలిపారు.

–ఓపెన్ అన్ని కేటగిరీలు కలిపి ఇంకా 264, 266, 272, 303, 369, 430, 445, 604, 631, 732, 780, 880, 951, 973 ర్యాంకులు కూడా సాధించారని వారు పేర్కొన్నారు. తమ విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన విద్యనందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరింత మందిని ఉన్నతంగా తీర్చిదిద్దుతామన్నారు. పటిష్ఠ ప్రణాళికతో 50 సంవత్సరాలుగా హైస్కూల్, జూనియర్ కాలేజీ, ఎంసెట్, ఐఐటీలో విద్యనందిస్తున్నామన్నారు. దీంతో తమ విద్యార్థులు ఏటా జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారన్నారు.

జేఈఈ ఫలితాల్లో యశ్వంత్‌రెడ్డికి 504 ర్యాంకు


యశ్వంత్ రెడ్డిని అభినందిస్తున్న తల్లిదండ్రులు

తొర్రూరు: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తొర్రూరుకు చెందిన అనుమాండ్ల యశ్వంత్‌రెడ్డి జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరీలో 504 ర్యాంకు సాధించారు. టెన్త్‌లో 10 జీపీఏ, ఇంటర్ ఎంపీసీలో 955 మార్కులు సాధించిన యశ్వంత్‌రెడ్డి.. తెలంగాణ ఎంసెట్‌లో 126 ర్యాంకు సాధించారు. కాగా, యశ్వంత్‌రెడ్డి తండ్రి సత్యనారాయణరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు.

ఎస్టీ కేటగిరీలో ఆకాశ్‌కు 142వ ర్యాంకు..


ఆకాశ్

గార్ల: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బానోత్ ఆకాశ్ ఆలిండియా స్థాయిలో ఎస్టీ కేటగిరీలో 142వ ర్యాంకు సాధించాడు. గార్ల మండలం రాజుతండాకు చెందిన ఆకాశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఉత్తమ ర్యాంకు సాధించాడు.కాగా, ఆకాశ్‌ను తల్లితండ్రులు బానోత్ కిషన్, నీల, కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు,అధ్యాపక బృందం, గ్రామస్తులు అభినందించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచాటిన నిఖిత


నిఖిత

కాజీపేట అర్బన్ : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సువిద్య జూనియర్ కళాశాల విద్యార్థిని పత్తి నిఖిత ఆలిండియా స్థాయిలో సీఆర్ఎల్ విభాగంలో 4241, ఎస్సీ కేటగిరీలో 90వ ర్యాంక్ సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ కే శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిఖితను కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ఏ.జితేందర్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

జేఈఈలో నితిన్ కుమార్‌కు 1448 ర్యాంక్


నితిన్‌కుమార్

మడికొండ: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కాజీపేట మండలం మడికొండలోని వర్ధన్నపేట బాలుర గురుకుల కళాశాల విద్యార్థి లావుడ్య నితిన్ కుమార్ ప్రతిభ కనబరిచారు. ఆలిండియా స్థాయిలో ఎస్‌టీ క్యాటగిరీలో 1448 ర్యాంక్ సాధించినట్లు కళాశాల మహ్మద్ కుర్షిద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థిని కళాశాల సిబ్బంది అభినందించారు. అదేవిధంగా నీట్‌లో నలుగురు విద్యార్థులు ప్రిపరేటరీ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఏబీవీ విద్యార్థి ప్రభంజనం


పవన్→

జనగామ : జేఈఈ అడ్వాన్స్‌డ్–2023 ఫలితాల్లో జనగామ పట్టణంలోని ఏబీవీ జూనియర్ కళాశాల విద్యార్థి కేతావత్ పవన్ ప్రభంజనం సృష్టించాడు. ఆలిండియా స్థాయిలో 807(రిజర్వుడ్) ర్యాంకు సాధించాడు. కాగా, జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కళాశాల కీర్తిని నలుమూలల చాటిన పవన్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం ఆదివారం అభినందించింది.

రోడ్డు ప్రమాదంలో ఎస్సై దుర్మరణం


కుమారస్వామి (ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం వరంగల్–నర్సంపేట రహదారి హర్జాతండా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీఆర్బీలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సోమ కుమారస్వామి(58) దుర్మరణం చెందారు. డ్యూటీ ముగించుకొని భద్రాద్రి కొత్తగూడెం నుంచి కారు నడుపుకుంటూ వస్తుండగా మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని రక్షించడానికి స్థానికులు సీపీఆర్ చేసి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. గీసుకొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన కుమారస్వామి ములుగు పోలీస్‌స్టేషన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. తరువాత జనగామ, మట్టెవాడ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. అనంతరం పదోన్నతిపై ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించారు. సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్లారు. డ్యూటీ ముగిసిన తర్వాత ఆయన నివాసముంటున్న వరంగల్‌లోని కాశిబుగ్గ ప్రాంతానికి వస్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలిని ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, ఎస్సై శ్వేత సందర్శించారు. మృతుడికి భార్య మణెమ్మ, కూతుర్లు డాక్టర్ సియెష, సుచరిత ఉన్నారు. మృతి చెందిన ఎస్సై.. ఎంసీపీఐ నాయకుడు సోమ రాజన్నకు దగ్గరి బంధువు. ఎస్సై ఉత్తర తెలంగాణ జిల్లాలోనే ఆదివాసీ తోటి కులానికి చెందిన వారిగా గుర్తింపు చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకొని తెగ వాసులు కన్నీరు మున్నీరయ్యారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కాశిబుగ్గలోని నివాసానికి తరలించారు.

కారును ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


సాబీర్ (ఫైల్)

కాటారం: లారీడ్రైవర్ అతివేగం, అజాగ్రత్తతో ఓ వ్యక్తి ప్రాణాన్ని బలికొంది. కాటారం మండలం నస్తూర్‌పల్లి సమీపంలో కాటారం–మహదేవపూర్ జాతీయ రహదారిపై ఆదివారం లారీ కారును ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మహదేవపూర్‌కు చెందిన ఎండీ జాబ్రీ సాబీర్(37), అదే గ్రామానికి చెందిన ఎండీ జమీర్ కలిసి కారులో కాటారం వస్తున్నారు. కాటారం నుంచి మహదేవపూర్ వైపుగా వెళ్తున్న ఇసుక లారీ అతివేగంతో ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో సాబీర్ అక్కడికక్కడే మృతి చెందగా జమీర్ తీవ్రంగా గాయపడ్డాడు. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. సమాచారం తెలుసుకున్న ఎస్సై హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిన జమీర్‌ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య సమీన, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన..

రోడ్డు ప్రమాదంలో సాబీర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు అధిక సంఖ్యలో ప్రమాద స్థలానికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని తీసుకెళ్లి మహదేవపూర్‌లో ఆందోళన చేపట్టారు. తగిన నష్ట పరిహారం చెల్లించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాటారం ఎస్సై శ్రీనివాస్, మహదేవపూర్ ఎస్సై రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. అధికారులతో మాట్లాడి మృతుని కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని ఎస్సైలు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గాంధీనగర్‌లో ట్రక్ ఢీకొని వృద్ధురాలు..


చిలుకమ్మ మృతదేహం

గణపురం: మండలంలోని గాంధీనగర్ 353వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలుకమ్మ(55) వృద్ధురాలు మృతి చెందగా వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కర్కపల్లికి చెందిన ఇడబోయిన చిలుకమ్మ వృద్ధురాలు తన మనుమరాలును చూసేందుకు గాంధీనగర్‌కు వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వెళ్తుండగా తనకు తెలిసిన ఖమ్మం జిల్లాకు చెందిన వెంకన్న బైక్‌పై ఎక్కించుకుని గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ట్రక్ ఢీకొట్టింది. సమాచారం తెలిసిన వెంటనే ఎస్సై అభినవ్ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరిని 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా చిలుకమ్మ మార్గమధ్యలోనే మృతి చెందగా వెంకన్న పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు.

వడదెబ్బతో గీత కార్మికుడి మృతి


రాజు గౌడ్ (ఫైల్)

గణపురం : మండల కేంద్రానికి చెందిన మార్క రాజు గౌడ్ (38) ఆదివారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన రాజు గౌడ్ రోజు మాదిరిగానే పనిలో భాగంగా మధ్యాహ్నం తాడి చెట్టు ఎక్కి తిరిగి ఇంటికి వెళ్లిన అనంతరం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చూసి వెంటనే ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతిడికి భార్య సంధ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు పరామర్శించారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గాజుల అశోక్ (35) గ్రామ శివారులోని గుట్టపై ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గొర్రెల కాపరి గుర్తించడంతో ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై వీరభద్రరావు కథనం ప్రకారం.. అశోక్, కోమల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దంపతులు కూలీ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అశోక్ రోజు మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో నెల 3వ తేదీన కూడా గొడవ పడడంతో కోమల తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో కోమలకు తన అత్తగారు సమ్మక్క ఫోన్ చేసి అశోక్ రెండు రోజుల నుంచి కనిపించడం లేదని, నీ దగ్గరకు వచ్చాడా అని అడగగా రాలేదని చెప్పింది. శనివారం సాయంత్రం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మహేందర్.. గుట్టలలో చెట్టుకు ఉరివేసుకొన్న అశోక్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు గుట్టకు చేరుకుని అశోక్ మృతదేహాన్ని గుర్తించి బోరున విలపించారు. ఈ ఘటనపై కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.కాగా, అశోక్ మృతదేహాన్ని నడుము భాగం వరకు గుర్తు తెలియని జంతువులు తిన్నాయి.

తండ్రికి ఎంతచేసినా తక్కువే

- నాన్న రూపం ఉండాలని గుడికట్టించిన కుమారులు
- వర్ధంతి సందర్భంగా ఆలయంలో విగ్రహం ఏర్పాటు


పిచ్చయ్య విగ్రహం వద్ద కుమారులతో ప్రజాప్రతినిధులు

పెద్దవంగర: జన్మనిచ్చిన తండ్రికి ఎంత చేసినా తక్కువేనని భావించిన ఆ కుమారులు..నాన్న రూపం జీవితాంతం తమ కళ్లెదురుగా ఉండాలని భావించారు. గుడి కట్టించి అందులో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించి తమకున్న ప్రేమను చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని వడ్డెకొత్తపల్లికి చెందిన పల్లపు పిచ్చయ్య (80) గత ఏడాది జూన్ 18న మృతి చెందాడు. ఆయనకు వెంకన్న, సమ్మయ్య, శ్రీనివాస్, మురళి (లేట్) నలుగురు సంతానం. కుమారులు తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక ఎల్లకాలం తండ్రి గుర్తుండేలా మొదటి వర్ధంతిని పురస్కరించుకొని గ్రామంలోని ఇంద్రకాలనీలో వారి సొంత స్థలంలో గుడి కట్టించి అందులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పండితులతో ప్రత్యేక పూజలు చేయించి తమకున్న మమకారాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్ ఉషాదయాకర్‌రావు, ఎంపీపీ రాజేశ్వరి, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, నాయకులు ఈదురు ఐలయ్య, ముత్తినేని శ్రీనివాస్, తంగెళ్లపల్లి మల్లికార్జున్ చారి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రవి, బండారి వెంకన్న, ఉపేందర్, బొల్లు ఊషయ్య, సుభాష్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

కనికరించని కన్నవాళ్లు

- వృద్ధురాలికి తిండిపెట్టని కుటుంబీకులు
- నీడ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన సాంబలక్ష్మి


సాంబలక్ష్మి

శాయంపేట : నవమాసాలు మోసి, అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసి ఉన్న యావదాస్తిని పంచి ఇవ్వగా వృద్ధాప్యంలో అన్నం పెట్టాల్సిన కుటుంబీకులే ఇంట్లో చోటు లేదని పొమ్మంటున్నారు. తనకు బుక్కెడు అన్నం పెట్టి తలదాచుకోవడానికి నీడ కల్పించాలని వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి కథనం ప్రకారం.. మండలంలోని గట్లకానిపర్తికి చెందిన నరెడ్ల సాంబలక్ష్మి, రామచంద్రు దంపతులకు ఇద్దరు కుమారులు లక్ష్మయ్య, శ్రీనివాస్, కుమార్తె లావణ్య ఉన్నారు. రామచంద్రుకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. రామచంద్రు మరణంతో భూమిని నాలుగు భాగాలుగా చేశారు. కుమార్తె లావణ్య వివాహం కోసం రెండు భాగాల భూమిని అమ్మి వివాహం జరిపించారు. చిన్నకుమారుడు శ్రీనివాస్ ఇంటి ముందున్న పెంకుటిల్లులో సాంబలక్ష్మి నివసిస్తుంది. శ్రీనివాస్ 15 ఏళ్ల క్రితం మరణించాడు. సాంబలక్ష్మి వృద్ధురాలు కావడంతో పెద్ద కొడుకు లక్ష్మ య్య, చిన్న కోడలు ఉమ భోజనం పెట్టాలని గ్రామపెద్దల సమక్షంలో వేడుకోగా పెద్ద కుమారుడు ఒప్పుకోకపోవడంతో చిన్నకోడలు వద్దే ఉంటుంది. ఇటీవల ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో నిర్మాణం చేపట్టాలని సాంబలక్ష్మి పెద్ద కుమారుడు లక్ష్మయ్యను అడిగినా ఒప్పుకోలేదు. చిన్న కోడలు ఉమ కూడా పెద్ద కుమారుడు భోజనం పెడితేనే తాను పెడుతానని తెలిపింది. ఈ విషయమై సర్పంచ్ సాంబయ్య దృష్టికి తీసుకెళ్లగా కబురుపంపినా వా రు పంచాయితీకి రాకపోవడంతో వృద్ధురాలు పోలీ స్ స్టేషన్‌ను ఆశ్రయించి కుమారుడు, కోడలుపై ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. వృద్ధాప్యంలో తనకు నీడ, భోజన వసతి కల్పించాలని వేడుకుంది.

రూ.8 కోట్లతో అడ్తి వ్యాపారి పరార్?

నర్సంపేట : నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఓ అడ్తివ్యాపారి రూ. 8 కోట్లతో పరారైనట్లు పట్టణంలో చర్చ సాగుతోంది. అడ్తి వ్యాపారంతో పాటు నెల వారి చిట్టీలు నడుపుకుంటూ పలువురితో పరిచయం పెంచుకున్నాడు. ఫైనాన్స్ ఆఫీస్ నడిపించుకుంటూ రూ.8 కోటకు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి ఇవ్వకుండా ఐపీ దాఖలు చేసినట్లు తెలిసింది. వారం క్రితం కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్చాఫ్ చేయడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంచి మాట



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వమానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఇక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మనాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే 'సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అములులో నిలపాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికి ఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!



నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్లు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.

పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మబంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంతకన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు. అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?



రవితేజ

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.

వారికి కాజల్ ఓ ఉదాహరణ


– దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లులాంటింది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ

నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!



మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా – నందితా శ్వేత



అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వ తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వ తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

మా నాన్న సూపర్ హీరో!



సుధీర్‌బాబు

'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

ఇదేం జీవితం?



రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాస్త్రీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్ఎస్ శాస్త్రీ.

రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. చాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

సంక్రాంతికి జాతర



ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.